జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 18 | జూన్ | 2026 ◆ పేజీలు : 10

## రైతులకు యూరియా అందుబాటును సులభతరం చేసే యాప్ ప్రారంభం

- బేతంపూడి సొసైటీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా ప్రారంభం
- యూరియా పంపిణీలో పారదర్శకతకు నూతన అడుగు
- రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచన



**టేకులపల్లి, జూన్ 18, ప్రజాజ్యోతి:** రైతులకు యూరియా అందుబాటును మరింత సులభతరం చేయడంతో పాటు ఎరువుల పంపిణీలో పారదర్శకతను

మిగతా 2 లో...



# రుచికి బాల్యం బానిస

6 లో..

- రంగురంగుల స్నాక్స్ మోజులో చిన్నారులు
- పాఠశాలల వద్ద నాణ్యతలేని తినుబండారాల విక్రయాలు
- ఆకర్షణీయమైన ప్యాకెట్లలో అనారోగ్యపు ముప్పు
- ఆహార భద్రతా తనిఖీలపై తల్లిదండ్రుల ఆందోళన
- పిల్లల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న చిరుతిండ్ల సంస్కృతి

పిల్లవాడి చేతిలో కనిపించే రంగురంగుల స్నాక్స్ ప్యాకెట్ కేవలం చిరుతిండి మాత్రమే కాదు... అది భవిష్యత్తు ఆరోగ్యంపై నిశ్శబ్దంగా ప్రభావం చూపే ప్రమాద సంకేతమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాఠశాల గంట మోగగానే పుస్తకాల దుకాణాల కంటే చిరుతిండ్ల దుకాణాల వైపు చిన్నారుల అడుగులు వేగంగా సాగుతున్నాయి. రుచులు, రంగులు, ఆకర్షణీయమైన ప్రకటనల మాయలో పడుతున్న పిల్లలు తెలియకుండానే అనారోగ్యానికి చేరువవుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం....

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (ప్రజాజ్యోతి)
( భూక్యా రంజిత్ నాయక్ )

## మిషన్ భగీరథ పనుల జాప్యంపై ఎమ్మెల్యే కూనంనేని ఆగ్రహం



- రోడ్ల ధ్వంసం, పైప్ లైన్ల లీకేజీలపై అసహనం

  ప్రజలు అవస్థలు పడుతున్నా నిర్లక్ష్యం వీడరా!
- లీకేజీలను అరికట్టి నీటి సరఫరాను పునరుద్ధరించండి
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**కొత్తగూడెం కలెక్టరేట్ /పాల్వంచ, జూన్ 17,(ప్రజాజ్యోతి )** మిషన్ భగీరథ పైపులైన్ పనుల జాప్యం పై కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణ పరిధిలో జరుగుతున మిషన్ భగీరథ పైపులైన్ పనులతో ధ్వంసం అయిన రోడ్లను అధికారులు,ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కూనంనేని రోడ్ల ధ్వంసం, పైప్ లైన్ల లీకేజీలపై అసహనం వ్యక్తం

మిగతా 2 లో...

## ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యం
### ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

- ♦ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



**ములకలపల్లి జూన్ 17 (ప్రజాజ్యోతి ):** అశ్వారావుపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. బుధవారం ములకలపల్లి మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, 47 మంది అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కొత్తగంగారం గ్రామంలో రూ.31.60 లక్షల వ్యయంతో గైడ్‌వాల్ నిర్మాణం, జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.5 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం, అంబేత్కర్ నగర్, రాజాపురం పాఠశాలల్ ప్రహరీ గోడల నిర్మాణం, రూ.20 లక్షల వ్యయంలో తో రెండు వీవో

మిగతా 2 లో...

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రూ.65 లక్షలతో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్డు నిర్మాణాలకు భూమి పూజ
- కల్యాణలక్ష్మి, షాధీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**బూర్గంపహాడ్, జూన్ 17 (ప్రజాజ్యోతి ):** గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆయన బూర్గంపహాడ్ మండల కేంద్రంలో రూ.65 లక్షల అంచనాతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్డు పనులకు ఆయన ప్రజా ప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం పాయం మాట్లాడుతూ గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు అభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల్లో సీసీ రోడ్లు

మిగతా 2 లో...

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి...)

పూర్తయితే రవాణా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. తొలుత ఎమ్మెల్యేను నాయకులు, ప్రజాప్రతినిధులు గజమాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. అనంతరం బూర్గంపహాడ్లో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న చెన్నం ప్రసాద్ సతీమణి వెంకటరమణ, చెన్నం సత్యనారాయణలను ఎమ్మెల్యే పాయం వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు.

### ♦ కల్యాణలక్ష్మి, షాధీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ...

మండల పరిధిలోని సారపాక వాసవీ ఫంక్షన్హాల్లో తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో |ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని 34 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాధీముబారక్ చెక్కులు అందించడంతో పాటు 25 మందికి రూ.13 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ కేఆర్ కే ప్రసాద్, పీఆర్ డీఈ పొదెం వెంకటేశ్వరరావు, ఏఈ చక్రధరాచారి, సర్పంచ్లు మందా నాగరాజు, బాదం వెంకటేష్రెడ్డి, పోతినేని సూరమ్మ, సర్పా నాగమణి, లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, భజన సతీష్, ప్రసాద్, ఇంగువ రమేష్, వారాల వేణు, పూలపెల్లి సుధాకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి...)

భవనాల నిర్మాణం, మూకమామిడి–రంగాపురం మధ్య రూ.1 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే రింగురెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో రూ.10 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామీణ వైద్యుడు, 'దిశ' ములకలపల్లి రిపోర్టర్ ఇనుకుర్తి రామాచారి తండ్రి మంగళవారం మృతి చెందగా, ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగన్నాథపురం, ములకలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన 'బడిబాట' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రహదారులు, విద్య, గృహాలు, మహిళా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు సోడే చైతన్య, కుంజా వినోద్, కోర్స ఆదిలక్ష్మి, భద్రం, కోర్స చంద్రకళ, దమ్మపేట మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కణితి సత్యనారాయణ, తహసీల్దార్ స్వాతి, ఎంపీడీఓ రామారావు, ఎంపీఓ రమేష్, ఎంఈఓ సత్యనారాయణ, ఏఈలు శ్రీనివాసరావు, నరేష్, సుబ్బరాజు, సాహిత్య, శ్రీధర్, వి.వి.ఎస్. ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎం.డి. జహీర్, జిల్లా నాయకులు బత్తుల అంజి, తాండ్ర ప్రభాకరరావు, పెటేటి నరసింహారావు, గాడి తిరుపతి రెడ్డి, కారం సుధీర్, పిడియాల బుజ్జిబాబు, మీడియం నారాయణ, సురభి రాజేష్, గుంట్రూ సాయిరాం, అజీజ్, కౌలూరి ప్రసాద్, కూరం రామకృష్ణ, సోయం బోదప్ప, షేక్ జానీ, పాలకుర్తి సుమిత్, పాలకుర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పనుల జాప్యంపై ఎమ్మెల్యే కూనంనేని ఆగ్రహం



(మొదటి పేజీ తరువాయి...)

చేసిన ఆయన ప్రజలు అవస్థలు పడుతున్నా నిర్లక్ష్యం వీడరా అని అధికారులును ప్రశ్నించారు. సమస్య తీవ్రతను గుర్తించి స్పందించకపోవడం సరైందికాదునీ, తక్షణమే పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు తొలగించి లీకేజీలను అరికట్టి నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లో మళ్లీ క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని హెచ్చరించారు. అంబేద్కర్ సెంటర్ లో తక్షణమే సిమెంట్ రోడ్ నిర్మించాలని, ప్రధాన జాతీయ రహదారి అయినందున ట్రాఫిక్ సమస్య రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రోడ్ నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, ఇంచార్జీ కమిషనర్ విజయానంద్ ఎలక్ట్రికల్ ఏడిఈ అబ్దుల్ రెహమాన్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, గొర్రె అన్నపూర్ణ, పైడిపల్లి జయలక్ష్మి, ఎస్ సుగుణ, మల్లెల స్వప్న కుమారి, దంతబోయిన నరేష్, నాయకులు వీ పద్మజ, డి సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శెనగారపు శ్రీనివాసరావు, ఎస్ ఏ రెహమాన్, వైఎస్ గిరి, గొర్రె నరేష్, నామ పండు, ఆలపాటి ప్రసాద్, అల్లి వెంకటేశ్వర్లు వివిధ శాఖల డి ఈ లు ఏఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సుజాతనగర్ లో ముత్తూట్ ఫైనాన్స్ నూతన శాఖ ప్రారంభం

- ఎస్సై రమాదేవితో కలిసి ప్రారంభించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు



**సుజాతనగర్, జూన్ 17 ( ప్రజాజ్యోతి )** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సుజాతనగర్ ఎన్ఎస్ఆర్ కాంప్లెక్స్లో ఏర్పాటు చేసిన ముత్తూట్ ఫైనాన్స్ నూతన శాఖను బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు, స్థానిక ఎస్సై మాలోత్ రమాదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగా సీతారాములు మాట్లాడుతూ ఆర్థిక సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో ముత్తూట్ ఫైనాన్స్ సేవల విస్తరణ అభినందనీయమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు అత్యవసర ఆర్థిక అవసరాల సమయంలో ఇలాంటి సంస్థలు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కొత్త శాఖ ద్వారా బంగారు ఆభరణాలపై రుణాలు, వ్యాపార అవసరాలకు ఆర్థిక సాయం, ఇతర ఆర్థిక సేవలు ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. స్థానిక ఎస్సై మాలోత్ రమాదేవి మాట్లాడుతూ ప్రజలు ఆర్థిక లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ విశ్వసనీయ సంస్థల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ సంస్థ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధులు అతిథులను సన్మానించారు. నూతన శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా అందుబాటును సులభతరం చేసే యాప్ ప్రారంభం





(మొదటి పేజీ తరువాయి...)

పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చరవాణి యాప్‌ను టేకులపల్లి మండలంలోని బేతంపూడి సొసైటీ కార్యాలయంలో బుధవారం ఘనంగా ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య యాప్‌ను ప్రారంభించి రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గతంలో యూరియా కొరతపై ఏర్పడిన అపోహలు, పంపిణీ సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. యాప్ ద్వారా యూరియా అవసరాలు ముందుగానే నమోదు చేసుకునే అవకాశం రైతులకు కలుగుతుందని, దీనివల్ల ఎరువుల పంపిణీ మరింత సమర్థవంతంగా సాగుతుందని పేర్కొన్నారు.

### »» రైతులకు ముందస్తు సమాచారం అందించాలి

ప్రతి 15 రోజులకు ఒకసారి యూరియా పంపిణీ వివరాలను రైతులకు ముందుగానే తెలియజేయాలని, ఎన్ని ఎకరాలకు ఎంత మేర యూరియా కేటాయిస్తున్నారనే విషయాన్ని స్పష్టంగా వెల్లడించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన లేని రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

### »» సిగ్నల్ లేని ప్రాంతాల రైతులకు ప్రత్యేక చర్యలు

బర్లగూడెం వంటి మొబైల్ సిగ్నల్ సౌకర్యం పరిమితంగా ఉన్న గ్రామాల రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ విధానాల ద్వారా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు అవసరానికి మించి యూరియాను నిల్వ చేసుకోవద్దని, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగించాలని కోరారు.

### »» అంతర పంటల సాగుపై దృష్టి సారించాలి

వ్యవసాయంలో వ్యయాలను తగ్గించడంతో పాటు నేల సారాన్ని కాపాడేందుకు రైతులు అంతర పంటల సాగుపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించే ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలను కూడా రైతులు అనుసరించాలని అన్నారు. అనంతరం యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా యూరియా బస్తాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, జిల్లా నోడల్ అధికారి విద్యాచందన, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, వ్యవసాయ ఏడీ లాల్ సింగ్, జిల్లా వ్యవసాయ సహాయ అధికారి శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ బాలు నాయక్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు ఖాదర్ బాబు, వివిధ గ్రామాల సర్పంచులు, సొసైటీ డైరెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ భారత్‌కు తాళం..!

- పోస్ట్ ఆఫీస్ సర్కిల్‌లో నిరుపయోగంగా మారిన స్వచ్ఛ భారత్ నిర్మాణం
- లక్షలు ఖర్చు చేసినా ప్రజలకు అందని సౌకర్యం
- అధికారుల కళ్ల ముందే మూతపడ్డ మరుగుదొడ్డి
- ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యమా..? నిర్వహణ లోపమా..?

**కొత్తగూడెం, జూన్ 17 ( ప్రజాజ్యోతి )** స్వచ్ఛ భారత్ మిషన్ పేరుతో పారిశుద్ధ్య కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలిలో కనిపిస్తున్న పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. జిల్లా నడిబొడ్డున ఉన్న పోస్ట్ ఆఫీస్ సర్కిల్‌లో ప్రజల అవసరాల కోసం నిర్మించిన ప్రజా మరుగుదొడ్డి ప్రారంభానికే నోచుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పట్టణంలోని అత్యంత రద్దీ ప్రాంతంగా పేరొందిన పోస్ట్ ఆఫీస్ కూడలి వద్ద రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆటో డ్రైవర్లు, ట్రాఫిక్ సిబ్బంది, కార్మికులు, వ్యాపారులు, ప్రయాణికులు, పోస్టాఫీస్ సేవల కోసం వచ్చే ప్రజలు గంటల తరబడి ఈ ప్రాంతంలోనే గడుపుతుంటారు. అయినప్పటికీ అత్యవసరమైన మరుగుదొడ్డి సౌకర్యం అందుబాటులో లేకపోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. కొన్నేళ్ల క్రితం స్థానికులు, ఆటో యూనియన్లు, కార్మిక సంఘాల ప్రతినిధులు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. పోస్ట్ ఆఫీస్ సర్కిల్‌లో ప్రజా మరుగుదొడ్డి ఏర్పాటు చేయాలని సంతకాల సేకరణ నిర్వహించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న అధికారులు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా 2023లో మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టారు. అయితే నిర్మాణం పూర్తయిన తర్వాత పరిస్థితి అక్కడితోనే ఆగిపోయింది. భవనం నిర్మించినప్పటికీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. ప్రారంభించలేదు. నిర్వహణకు చర్యలు చేపట్టలేదు. ఫలితంగా ప్రజాధనంతో నిర్మించిన మరుగుదొడ్డి నేడు తాళాలు వేసి నిరుపయోగంగా మారింది.

### ››› అత్యవసర అవసరానికి కిలోమీటర్ల ప్రయాణం..!

పోస్ట్ ఆఫీస్ కూడలి వద్ద విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులు, ఆటో డ్రైవర్లు, కార్మికులు మరుగుదొడ్డి అవసరం వస్తే ప్రకాశం స్టేడియం లేదా సమీపంలోని సింగరేణి పాఠశాల పరిసరాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణ మధ్యలో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం వల్ల సమయం వృథా కావడంతో పాటు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ప్రయాణికులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మించిన సదుపాయం ప్రజలకు ఉపయోగపడకపోవడం విచారకరమని అంటున్నారు.




### ››› ప్రధాన కూడలిలోనే అధికారుల నిర్లక్ష్యం..!

జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలిగా ఉన్న ఈ ప్రాంతం గుండా ప్రతిరోజూ అధికారులు, ప్రజాప్రతినిధులు, వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ నిర్మాణం పూర్తయిన మరుగుదొడ్డి ఎందుకు ప్రారంభం కాలేదన్న ప్రశ్నకు సమాధానం కనిపించడం లేదు. స్వచ్ఛ భారత్ లక్ష్యాలు కేవలం నిర్మాణాల వరకే పరిమితమయ్యాయా..? లేక నిర్వహణ విషయంలో పూర్తిగా నిర్ లక్ష్యం వహిస్తున్నారా..? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రజా అవసరాల కోసం నిర్మించిన సదుపాయాన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడం వెనుక కారణాలేమిటో అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### ››› స్వచ్ఛ భారత్ నిధులు వృథా కాకూడదు

పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో నిర్మించిన సదుపాయాలు ప్రజలకు ఉపయోగపడకపోతే వాటి ప్రయోజనం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణాలు చేసి వదిలేయడం కాకుండా వాటిని నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉంచడమే స్వచ్ఛ భారత్ అసలు లక్ష్యమని గుర్తుచేస్తున్నారు. పోస్ట్ ఆఫీస్ సర్కిల్ పక్కన నిర్మించిన ప్రజా మరుగుదొడ్డిని వెంటనే శుభ్రపరచి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు, ఆటో డ్రైవర్లు, కార్మికులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన సౌకర్యం ప్రజలకే ఉపయోగపడేలా సంబంధిత శాఖలు తక్షణ చర్యలు చేపట్టి నిర్వహణ బాధ్యతలు స్వీకరించాలని కోరుతున్నారు.

## పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలు పునఃప్రారంభం



**బూర్గంపహాడ్, జూన్ 17 (ప్రజా జ్యోతి ):** జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మండలంలో ఆయా ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని బూర్గంపహాడ్ మండల ఎంఈవో యదుసింహరాజు బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆధారనమోదు కేంద్రం ఏర్పాటు చేశామని ఈ నమోదు కేంద్రాలను విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఈఓ యదసింహారాజు ఆదేశాల మేరకు ఎంఐఎస్ కోఆర్డినేటర్ కిషన్ ఆధార్ కేంద్రాన్ని సందర్శించారు. కాగా జిల్లా వ్యాప్తంగా 34 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయని.. ప్రతి మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వీటిని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఆధార్ నమోదు కేంద్రంలో డెమోగ్రఫిక్, బయోమెట్రిక్, మ్యాండటరీ బయోమెట్రిక్, న్యూ ఎన్రోల్మెంట్ ( కొత్త ఆధార్ ), పుట్టిన తేదీ, పేరు, అడ్రస్ మార్పు సేవలు అందుబాటులో ఉంటాయని, 5 ఏళ్లు, 15 ఏళ్లు దాటిన పిల్లలు, పెద్దలు వేలిముద్రలు ద్వారా అప్డేట్ ఖచ్చితంగా చేసుకోవాలని సూచించారు.

## భద్రాచలంలోని పలు హోటళ్లలో తనిఖీలు నిర్వహించిన ఫుడ్ ఇన్స్పెక్టర్

- చెట్టు కొమ్మలు నరికిన ఘటనలో జరిమానా

**భద్రాచలం టౌన్, జూన్ 17 ప్రజా జ్యోతి** భద్రాచలంలోని పలు హోటళ్లలో బుధవారం జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి శరత్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల తయారీకి వినియోగించే పప్పు దినుసులు, కూరగాయలు, పిండి పదార్థాలతో పాటు వంటశాలల్లో పరిసరాలను తనిఖీ చేశారు. రాబోయే వర్షాకాలం సందర్భంగా హోటళ్లలో శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వంటశాలల్లో నిల్వ పదార్థాలను ఉపయోగించవద్దని ఆదేశించారు. అదేవిధంగా ఇటీవల ఓ వినియోగదారుడు ఓ హోటల్‌లో అల్పాహారం స్వీకరిస్తుండగా సాంబార్లో పురుగు వచ్చిన ఘటన సామాజిక మాధ్యమాలలో ట్రోల్ అయిన సంఘటనపై విచారించి ఆ హోటల్ నుంచి శాంపిల్స్ సేకరించి తీసుకెళ్లారు. అలాగే ఓ హోటల్ నిర్వాహకుడు తన హోటల్ ఎదురుగా ఉన్న చెట్టు కొమ్మలను నరికివేసిన ఘటనపై భద్రాచలం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ విచారణ చేసి ఆ హోటల్ నిర్వాహకుడికి రూ.5 వేలు జరిమాన విధించారు.



## భక్తిశ్రద్ధలతో భద్రగిరి ప్రదక్షిణ





**భద్రాచలం టౌన్ , జూన్ 17, ప్రజాజ్యోతి,** పవిత్ర పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అధ్యర్యంలో బుధవారం భద్రగిరి గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భద్రగిరి ప్రదక్షిణకు బయలుదేరారు. రాజవీధి, కల్యాణ మండపం రోడ్డు మీదుగా భక్తరామదాసు విగ్రహం వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు. ఈ సమయంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. శ్రీ సీతారామచంద్ర స్వామివారిని స్మరించుకుంటూ భద్రగిరి చుట్టూ గిరి ప్రదక్షిణ నిర్వహిచారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, భక్తరామదాసు ట్రస్టు నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బుధవారం సందర్భంగా రామాలయంలోని నిత్యకల్యాణ మండపం వద్ద స్వామికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## జ్ఞాపకాలతో శ్రవణ్‌కు అన్నదాన నివాళి

- నాలుగో వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యుల సేవా కార్యక్రమం
- యాచకులు, వృద్ధులకు భోజనాల పంపిణీ



**కొత్తగూడెం, జూన్ 17 ( ప్రజాజ్యోతి )** లక్ష్మీదేవిపల్లి మండలం, సింగరేణి కాలరీస్ ఇల్లందు గెస్ట్ హౌస్ ప్రాంతానికి చెందిన నక్క శ్రవణ్‌కుమార్ నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. భార్య శిరీష, కుమార్తె శ్రీనిజా, కుమారుడు వర్షిత్‌తో పాటు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండ్ సెంటర్, రైల్వే సెంటర్ పరిధిలోని యాచకులు, నిరాశ్రయులు, వృద్ధులకు భోజనాలు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. శ్రవణ్‌కుమార్ భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన స్మృతులు తమ కుటుంబంలో నిత్యం సజీవంగానే ఉన్నాయని భావోద్వేగానికి గురయ్యారు. అందరితో ఆప్యాయంగా మెలుగుతూ స్నేహానికి విలువ ఇచ్చే వ్యక్తిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరినీ ఆప్యాయంగా పలకరించే స్వభావం, అవసరంలో ఉన్న వారికి సహాయం చేయాలనే తపన ఆయనను అందరికీ చేరువ చేసిందన్నారు. నాలుగేళ్లు గడిచినా ఆయన లేని లోటు కుటుంబ మదిలో ఇప్పటికి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల్లో శ్రవణ్ ఆయన జ్ఞాపకాలు కనిపిస్తూనే ఉంటాయని కుటుంబ ప్రతి సందర్భంలో గుర్తు చేసుకుంటారని తెలిపారు. శ్రవణ్‌కుమార్ స్మారకార్థం ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయనను స్మరించుకుంటున్నట్లు చెప్పారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వృద్ధులు, యాచకులు భోజనాలు స్వీకరించి శ్రవణ్‌కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మంచి మనసుతో జీవించిన వ్యక్తి చేసిన సేవలు, మానవీయ విలువలు చిరకాలం గుర్తుండిపోతాయని పలువురు అభిప్రాయపడ్డారు. నాలుగో వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.

## అంబేద్కర్ విగ్రహ పునర్నిర్మాణంపై ఐటిసి పిఎస్పిడి అధికారులతో చర్చలు



**భద్రాచలం టౌన్, జూన్ 17 ప్రజాజ్యోతి** భద్రాచల అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహ పునః నిర్మాణం పనుల కోసం ఐటిసి అధికారి చంగల్ రావు, సివిల్ ఇంజనీర్‌లతో ఎస్సీ ఎస్టీ. బీసీ, మైనార్టీ నాయకులు కలిసి చర్చించారు. అంబేద్కర్ విగ్రహానికి కావాల్సిన లైటింగ్, సేఫ్టీ గ్రిల్, ఫౌండేషన్ యొక్క నమూనా గురించి పరిశీలించారు. త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడతాం అని ఐటిసి పిఎస్పీడీ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముర్ల రమేష్,ముద్ద పిచ్చయ్య, ఇమంది నాగేశ్వరరావు, దాసరి శేఖర్, పొదుతురీ ప్రేమ్ సాయి, పులి ప్రసాద్ పాల్గొన్నారు.

# పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం




- **పేదలకు వరం సీఎం సహాయనిధి: ఎమ్మెల్యే**

**ఇల్లందు, జూన్ 17 (ప్రజా జ్యోతి)** రాష్ట్రంలోని పేద ప్రజల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సియంఆర్ఎఫ్) ఒక వరమని పేర్కొన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో వైద్యం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. ఇల్లందు మండలం, పట్టణ పరిధికి చెందిన 47 మంది బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేయడం జరిగిందని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 56 మంది లబ్ధిదారులకు రూ. 56,06,496 విలువైన చెక్కులను పంపిణీ చేశామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతో కొలువుతీరిన ప్రజా ప్రభుత్వం ప్రచారంజాక పాలనను కొనసాగిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ అసత్య ఆరోపణలు చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీ మాయం మాటలను స్థితిలో ప్రజలు లేరని, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన పార్లమెంట్, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ దొడ్డ చైర్మన్ కిరణ్ మిత్ర డానియల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, అజ్మీరా వంశీ, చిల్లా విజయ భారతి, రాధ కమల్ కోరి, మెరుగు కార్తీక్, దండు సారయ్య, నీరుడు ఉపేంద్ర, ఉల్లింగ విజయలక్ష్మి, మహమ్మద్ జాఫర్, కొర్లపాటి శివ కిరణ్, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, దిశా కమిటీ సభ్యురాలు బానోత్ శారదా, మండల సర్పంచుల సంఘం అధ్యక్షురాలు పాయం స్వాతి, సొసైటీ డైరెక్టర్ కున్సోత్ రాము, నాయకులు ఎట్టి హరికృష్ణ, సర్పంచులు వల్లాల మంగమ్మ, తాటి యశోద, మెచ్చ సాయమ్మ, బోడ కిషోర్, ఈసాల సురేష్, ఈసం బాలకృష్ణ, పూనెం సురేందర్, తాటి బిక్షం, సంపత్, ఈసం నరసింహారావు, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ ఎంపీటీసీ, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కేటీఆర్ ను కలిసిన దిండిగాల





**ఇల్లందు, జూన్ 17 (ప్రజా జ్యోతి)** ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఇంటెన్సివ్ రివిజన్ బూత్ లెవెల్ ఏజెంట్లకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశానికి రాష్ట్ర మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకుడు, మాజీ భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ హెలిప్యాడ్ వద్ద శాలువా కప్పి కలిశారు. త్వరలో చేపట్టనున్న టిఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదును ఉత్సాహంతో పూర్తి చేయాలని, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలను చైతన్యపరచాలని కేటీఆర్ చూపించినట్లు దిండిగాల రాజేందర్ తెలిపారు. కార్యక్రమంలో టీబిజీకెఎస్ ఇల్లందు ఉపాధ్యక్షుడు మహమ్మద్ జాఫర్ హుస్సేన్, నాయకులు మూలగుండ్ల ఉపేందర్, లలిత్ పాసి, మునిగంటి శివ తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ లో ప్రసవం

- **భద్రాద్రి వంతెనపై మగబిడ్డకు జన్మనిచ్చిన తల్లి**

**బూర్గంపహాడ్, జూన్ 17 (ప్రజా జ్యోతి):** గర్భిణికి పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్లో భద్రాచలం తరలిస్తుండగా వంతెనపై మగబిడ్డకు తల్లి జన్మనిచ్చిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని సారపాక పంచాయతీ రామాపురం గ్రామానికి చెందిన గర్భిణి తులశమ్మకు పురిటి నొప్పులు రావడంతో భర్త మహేష్, కుటుంబసభ్యులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. రామాపురం చేరుకున్న 108 వాహన సిబ్బంది ఈఎంటీ జ్యోతి, పైలెట్ మేకల రామకృష్ణ తులశమ్మను వాహనంలో ఎక్కించుకుని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో భద్రాచలం–సారపాక వంతెనపై నొప్పులు అధికంకావడంతో అంబులెన్స్ను పక్కనే ఆపి ఈఎంటీ జ్యోతి సమయస్ఫూర్తితో వ్యవహరించి కాన్పు చేశారు. అయితే తులశమ్మకు ఇది రెండో కాన్పు కావడం...మగబిడ్డకు జన్మనివ్వడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఇద్దరినీ ఆసుపత్రికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహించగా తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. 108 సిబ్బంది సకాలంలో స్పందించి కాన్పు చేయగా తులశమ్మకు సుఖప్రసవం జరగడంతో కుటుంబసభ్యులు, భర్త వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నయీముద్దీన్





**ఇల్లందు, జూన్ 17 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యండి నయీముద్దీన్ (నయీమ్) ను ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగం జాతీయ కోఆర్డినేటర్ హెచ్ యం షకీల్ నవాజ్ నియమించారు. ఈ సందర్భంగా నయిముద్దీన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించేందుకు సహకరించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తనకు ఈ పది వచ్చేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నయీముద్దీన్ కు ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## మామిడి గుండాల సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలి

**ఇల్లందు, జూన్ 17 (ప్రజా జ్యోతి)** మామిడి గుండాల లోని నెమరుగమ్ముల రాఘవేంద్రరావు సీలింగ్ భూములలో దశాబ్దాలుగా ఆ ప్రాంత గిరిజన, ఆదివాసి రైతులు సాగు చేసుకుంటున్నందున ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని సాగులో ఉన్న రైతులకు ఇవ్వాలని అఖిలపక్ష నాయకులు అధికారులు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక చంద్ర కృష్ణమూర్తి విజ్ఞాన భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ 4000 ఎకరాలకు పైగా ఉన్న నెమరుగమ్ముల రాఘవేంద్రరావు భూముల్లో 2500 ఎకరాలు ఆ ప్రాంతంలో సాగు చేసుకుంటున్న రైతులకు ఇచ్చారని, మిగిలిన భూమిని సైతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం సదరు రాఘవేంద్రరావు కుటుంబానికి పోగా పట్టాలు చేసి సాగులో ఉన్న రైతులకు ఇవ్వాలని అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఈ భూములకు సరైన హద్దులు లేకపోవడంతో ఈ ప్రాంతంతో సంబంధం లేని వ్యక్తులు వచ్చి సాగులో ఉన్న రైతులను బెదిరిస్తున్నారని ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతులకు ఇచ్చిన భూములకు హద్దులు ఏర్పాటు చేసి హక్కుదారు



పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై దశల వారిగా ఆందోళన చేస్తామని జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, స్థానిక తహసిల్దార్ లను కలిసి వినతి పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకులు నబి, భాస్కర్, లక్ష్మయ్య, సంజీవ్, సిలివేరి సత్యనారాయణ, వీరభద్ర, కృష్ణ, రాంబాబు, ఆర్ఎస్పి బోస్ తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

- **మెనూ అమలుపై కలెక్టర్ అంకిత్ ఆగ్రహం**
- **విద్యార్థులకు పోషకాహారం, హాజరు శాతం పెంపు, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన**
- **మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్**



**పాల్వంచ, జూన్ 17, ప్రజాజ్యోతి:** పాల్వంచ దమ్మపేట సెంటర్లోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కిచెన్ షెడ్ను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందించడం లేదని గుర్తించిన కలెక్టర్, ప్రధానోపాధ్యాయులను వివరణ కోరారు. నిరంతరం పప్పు, అన్నం మాత్రమే వడ్డించడం సరికాదని, ప్రభుత్వం నిర్ణయించిన మెనూను తప్పనిసరిగా అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీసిన కలెక్టర్, హాజరు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలకు రాని విద్యార్థుల తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ, నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో పాల్వంచ తహసీల్దార్ ధారా ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పేరుకు పోలీసు... పోలీస్ సిబ్బందికి రక్షణ ఎక్కడ?

- పని ఒత్తిడి, సిబ్బంది కొరతతో సతమతం
- విశ్రాంతి లేక కుటుంబాలకు దూరమవుతున్న పోలీసులు
- సంక్షేమ చర్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలంటున్న సిబ్బంది




**టేకులపల్లి, జూన్ 18,ప్రజాజ్యోతి:** ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది తమ సంక్షేమం, ఆరోగ్యం, విశ్రాంతి విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రింబవళ్లు విధుల్లో నిమగ్నమవుతూ ప్రజల భద్రత కోసం అంకితభావంతో పనిచేస్తున్న పోలీసులు అధిక పని ఒత్తిడి, సిబ్బంది కొరత, విశ్రాంతి లేకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నారు.

**»› సిబ్బంది కొరతతో పెరుగుతున్న బాధ్యతలు**

పోలీస్ స్టేషన్లలో ఖాళీ పోస్టులు భర్తీ కాకపోవడంతో విధుల్లో ఉన్నసిబ్బంది పైనే అదనపు భారం పడుతోంది. ఒకే పోలీసు ఉద్యోగి శాంతిభద్రతల పర్యవేక్షణ, నేరాల దర్యాప్తు, కోర్టు విధులు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు తదితర బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. దీంతో శారీరక, మానసిక ఒత్తిడి రోజురోజుకూ పెరుగుతోందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

**»› 24 గంటల అప్రమత్తత.. విశ్రాంతికి నోచుకోని జీవితం**

సాధారణ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పోలీసులకు నిర్దిష్ట పని వేళలు ఉండవు. ఎప్పుడైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. పండుగలు, ఎన్నికలు, వీఐపీ పర్యటనలు, ప్రత్యేక బందోబస్తు వంటి సందర్భాల్లో వరుసగా గంటల తరబడి పనిచేయాల్సి వస్తోంది. సెలవులు సకాలంలో మంజూరు కాకపోవడంతో కుటుంబ సభ్యులతో సమయం గడపలేకపోతున్నామని పలువురు పోలీసు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**»› ఉన్నతాధికారులకూ తప్పని ఒత్తిడి**

స్టేషన్ స్థాయి సిబ్బందితో పాటు సీఐలు, డీఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు కూడా తీవ్ర ఒత్తిడిలో పనిచేస్తున్నారు. నేరాల నియంత్రణ, కేసుల పర్యవేక్షణ, పరిపాలనా బాధ్యతలు, సమావేశాలు, ఆకస్మిక తనిఖీలు, పైస్థాయి అధికారులకు నివేదికలు సమర్పించడం వంటి పనులతో వారు కూడా విశ్రాంతికి దూరమవుతున్నారు.

**»› ప్రజల భద్రత కోసం తమ జీవితాలనే అంకితం**

నేరాలను అరికట్టడం, బాధితులకు న్యాయం చేయడం, ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడడం పోలీసుల ప్రధాన బాధ్యత. అయితే ఈ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలంటే పోలీసులకు తగిన సిబ్బంది, ఆధునిక వసతులు, భద్రతా ప్రమాణాలు, విశ్రాంతి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

**»› సంక్షేమ చర్యలపై దృష్టి సారించాలి**

పోలీసు శాఖలో ఖాళీలను వెంటనే భర్తీ చేయడం, షిఫ్ట్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, వారాంతపు సెలవులు కల్పించడం, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, మానసిక ఆరోగ్య సలహా కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బంది కోరుతున్నారు. ప్రజల భద్రత కోసం అహర్నిశలు కష్టపడుతున్న పోలీసుల సంక్షేమంపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**»› ప్రశ్నగా మిగిలిన అంశం**

ప్రజలను కాపాడే పోలీసుల సంక్షేమాన్ని కాపాడేది ఎవరు? విధుల్లో అలసట, ఒత్తిడితో పోరాడుతున్న సిబ్బందికి తగిన విశ్రాంతి, రక్షణ, మానవీయ పని వాతావరణం ఎప్పుడు కల్పిస్తారన్న ప్రశ్న ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# అల్లూరి విగ్రహ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలి

- త్రాగునీటి లీకేజీలు, డ్రైనేజీ నిర్మాణ సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన 36వ డివిజన్ కార్పొరేటర్
- అల్లూరి సీతారామరాజు నూతన విగ్రహానికి నిధులు మంజూరు చేయాలి
- ఎమ్మెల్యే కూనంనేనికి కార్పొరేటర్ జయలక్ష్మి మనోహర్‌రావు వినతి



**పాల్వంచ, జూన్ 17, ప్రజాజ్యోతి:** పట్టణంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న త్రాగునీటి పైపులైన్ లీకేజీలను పరిశీలించేందుకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పర్యటించారు. ఈ సందర్భంగా అల్లూరి సెంటర్‌లో 36వ డివిజన్ కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి మనోహర్‌రావు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.రోడ్డు విస్తరణ పనులలో భాగంగా తొలగించిన అల్లూరి సీతారామరాజు విగ్రహం స్థానంలో అదే ప్రదేశంలో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే అల్లూరి సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ఇరువైపులా నూతన డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా 36వ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో నెలకొన్న త్రాగునీటి పైపులైన్ లీకేజీల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, త్రాగునీటి పైపులైన్ లీకేజీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే అల్లూరి సీతారామరాజు నూతన విగ్రహ ఏర్పాటు, అల్లూరి సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నూతన డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మేయర్ మూడు గణేష్, డిప్యూటీ మేయర్ లలిత, కార్పొరేటర్లు సుగుణ, నరేష్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పైడిపల్లి దుర్గామహేష్, పట్టా వీరకుమార్, గుర్రం వెంకటరత్నం, వీరమాచినేని నరేష్, చంద్ర వీరయ్య, కార్పొరేషన్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దానవాయిపేటలో అక్షరాభ్యాస కార్యక్రమం





**చర్ల, జూన్ 17(ప్రజా జ్యోతి):** చర్ల మండలం ఆర్.కొత్తగూడెం పంచాయతీ పరిధిలోని దానవాయిపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు నానరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు తొలి అక్షరాలు దిద్దించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నానరాజు మాట్లాడుతూ ప్రతి చిన్నారి జీవితంలో అక్షరాభ్యాసం ఒక ముఖ్యమైన ఘట్టమని విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ తుర్రం రవికుమార్ చిన్నారులకు ఆశీస్సులు అందించి, విద్యా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జున్ రావు, వార్డు సభ్యులు కారం సుధాకర్, కణితి రజిని, కొమరం భద్రయ్య, చింతకాయల స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు చిలకమ్మ, పుష్ప, రామంజమ్మ, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు సుహాసిని, చింతకాయల హరిబాబు, పూర్ణిమ, శాంతకుమార్, నీలిమ, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కేవీకే ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం

**చర్ల, జూన్ 17:(ప్రజాప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో చర్ల మండలం ఉప్పరిగూడెం గ్రామంలో బుధవారం నేరుగా వరి వెదజల్లు (డైరెక్ట్ సీడెడ్ రైస్) సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్ అధ్యక్షత వహించగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిని పొడి విధానంలో సాగు చేయడం వల్ల నీటి వినియోగం తగ్గడంతో పాటు సాగు ఖర్చులు కూడా తగ్గుతాయని రైతులకు వివరించారు. రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా అవసరమైన మోతాదులోనే ఎరువులను వినియోగించాలని సూచించారు. అధికంగా ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేయాలని సూచించిన ఆయన ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి), కేఎన్ఎం-1638 వంటి రకాల సాగు ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.ఉద్యాన శాస్త్రవేత్త శివ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. వాతావరణ సమాచారం, పంటల యాజమాన్యం, చీడపీడల నివారణ వంటి అంశాలపై రైతులకు సాంకేతిక సలహాలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించి ఆయిల్ పామ్, మునగ, పందిరి పద్ధతిలో తీగజాతి కూరగాయల సాగు చేపడితే స్థిరమైన ఆదాయం పొందవచ్చని సూచించారు. ఆత్మ కమిటీ చైర్మన్ బుచ్చిబాబు మాట్లాడుతూ రైతులు వరిని వెదజల్లు విధానంలో సాగు చేయడం ద్వారా సమయం ఖర్చు ఆదా చేసుకోవచ్చని అన్నారు . అనంతరం రైతు సోయం అరవింద్ పొలంలో సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా వరి విత్తనాల వెదజల్లు విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో ఉప్పరిగూడెం సర్పంచ్ సోయం నాగలక్ష్మి, ఏఈవోలు అఫ్రిద్, రామకృష్ణ, మైరాడా అగ్రోనామిస్ట్ షణ్ముఖ సాయి, మహిళా సోషల్ మొబిలైజర్ నవీన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# మూలమలుపు వద్ద బోర్వెల్ బండి బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు





**టేకులపల్లి, జూన్ 17,ప్రజాజ్యోతి:** రోళ్లపాడు గ్రామం నుంచి బిలియాతండ వైపు వెళ్తున్న బోర్వెల్ బండి మార్గమధ్యంలోని ప్రమాదకర మూలమలుపు వద్ద అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో బోర్వెల్ బండి డ్రైవర్ రాజు (35) తీవ్రంగా గాయపడ్డాడు.స్థానికుల కథనం ప్రకారం, బోర్వెల్ బండి వేగంగా వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ రాజుకు తొడ ఎముక విరగడంతో పాటు ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అధిక రక్తస్రావం కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న టేకులపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ఇల్లందుకు తరలించారు.ప్రమాద సమయంలో స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొని బాధితుడిని అంబులెన్స్‌లోకి తరలించేందుకు సహకరించారు. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది.ఈ సహాయక చర్యల్లో ఈఎంటీ అశోక్, పైలట్ నాగేశ్వరరావు కీలకంగా వ్యవహరించారు. ప్రమాదానికి గల కారణాలపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## అశ్వాపురం సీఐగా బాధ్యతలు చేపట్టిన సిలువేరు ఎల్లయ్య



**అశ్వాపురం: జూన్ 17, ప్రజా జ్యోతి** అశ్వాపురం మండల కేంద్రం పోలీస్ స్టేషన్ లో నూతన సీఐగా సిలువేరు ఎల్లయ్య బుధవారం సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతించి అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ ఎల్లయ్య మాట్లాడుతూ, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తావు లేకుండా తనదంటూ శైలిలో పని చేస్తానని తెలిపారు. ప్రజా శ్రేయసే ధ్యేయంగా పనిచేస్తూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టిసాదిస్తానని తెలియజేశారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. మండలంలో ప్రజా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలి

- గ్రామాలలో క్షుద్ర పూజలు_ మూఢనమ్మకాలపై అవగాహన కల్పించాలి
- డి ఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 17,(ప్రజా జ్యోతి )** ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు కుష్టి వ్యాధి నిర్మూలన కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దుకాణం రాథోడ్ జిల్లాలోని వైద్యులను ఆదేశించారు, డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో బుధవారం జిల్లా వైద్య, కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాల పై డిపిఎంఓలు, హెల్త్ ఎడ్యుకేటర్ల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో కుష్ఠు వ్యాధి నిర్మూలన కోసం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కుష్ఠు వ్యాధి అనుమానితులను గుర్తించి పరీక్షలు నిర్వహించి, నిర్ధారణ అయిన వారికి వెంటనే మల్టీ డ్రగ్ థెరపీ చికిత్స ప్రారంభించి పూర్తిస్థాయిలో పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఆరోగ్య కేంద్ర పరిధిలో యాక్టివ్ కేస్ సెర్చ్, కాంటాక్ట్ సర్వేలు, ఫాలోఅప్ పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. కుష్ఠు వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలను చైతన్యపరచాలని హెల్త్ ఎడ్యుకేటర్లకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చికిత్స, వైకల్య నివారణ చర్యలు, స్వీయ సంరక్షణ పద్ధతులపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలు, గ్రామ సభలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామ ఆరోగ్య పారిశుద్ధ్య , పోషణ కమిటీ సమావేశాల ద్వారా ఆరోగ్య విద్యను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా ఐఈసి, బీసీసీ కార్యక్రమాలను బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో రికార్డులు, నివేదికలను సకాలంలో నవీకరించడం, నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో చేతబడి, బాణమతి క్షుద్ర పూజలు , మూఢనమ్మకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్, పీజీయోతెరపిస్ట బద్రు , వైద్యులు మోహన్, శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్లు జయలక్ష్మి, రమాదేవి ,బేబీ , వినయ్ కుమార్, బద్రు, ప్రతిభ, సంబంధిత జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.



# రుచికి బాల్యం బానిస

- రంగురంగుల స్నాక్స్ మోజులో చిన్నారులు
- పాఠశాలల వద్ద నాణ్యతలేని తినుబండారాల విక్రయాలు
- ఆకర్షణీయమైన ప్యాకెట్లలో అనారోగ్యపు ముప్పు
- ఆహార భద్రతా తనిఖీలపై తల్లిదండ్రుల ఆందోళన
- పిల్లల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న చిరుతిండ్ల సంస్కృతి

**పిల్లవాడి చేతిలో కనిపించే రంగురంగుల స్నాక్స్ ప్యాకెట్ కేవలం చిరుతిండి మాత్రమే కాదు... అది భవిష్యత్తు ఆరోగ్యంపై నిశ్శబ్దంగా ప్రభావం చూపే ప్రమాద సంకేతమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాఠశాల గంట మోగగానే పుస్తకాల దుకాణాల కంటే చిరుతిండ్ల దుకాణాల వైపు చిన్నారుల అడుగులు వేగంగా సాగుతున్నాయి. రుచులు, రంగులు, ఆకర్షణీయమైన ప్రకటనల మాయలో పడుతున్న పిల్లలు తెలియకుండానే అనారోగ్యానికి చేరువవుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం....**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (ప్రజాజ్యోతి)**
**( భూక్యా రంజిత్ నాయక్ )**

జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా చిన్నారులను లక్ష్యంగా చేసుకుని ప్యాకెట్ ఆహార పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కుర్‌కురేలు, చిప్స్, రింగ్స్, పఫ్‌లు, చాక్లెట్లు, కేకులు, బిస్కెట్లు, శీతల పానీయాలు వంటి ఉత్పత్తులు ప్రతి చిన్న దుకాణంలో దర్శనమిస్తున్నాయి. తక్కువ ధర, అధిక రుచి, ఆకర్షణీయమైన ప్యాకింగ్ కారణంగా పిల్లలు వీటికి అలవాటు పడుతున్నారు. పాఠశాలల పరిసర ప్రాంతాల్లో ఈ విక్రయాలు మరింత ఎక్కువగా కనిపిస్తున్నాయి.

### ♦ రంగురంగుల ప్యాకెట్లు... లోపల అనారోగ్యపు ముప్పు

పిల్లలను ఆకర్షించేందుకు తయారీ సంస్థలు కార్టూన్ బొమ్మలు, రంగురంగుల కవర్లు, బహుమతుల ఆఫర్లను వినియోగిస్తున్నాయి. అయితే అనేక ప్యాకెట్ ఆహార పదార్థాల్లో అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలు, కృత్రిమ రంగులు, రుచికారక రసాయనాలు ఉండే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తరచూ వీటిని తీసుకోవడం వల్ల జీర్ణకోశ సమస్యలు, ఊబకాయం, దంత సమస్యలు, పోషకాహార లోపాలు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

### ♦ పాఠశాలల వద్దే ఎక్కువ ఆకర్షణ

జిల్లాలోని అనేక పాఠశాలల సమీపంలో చిరుతిండ్ల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. మధ్యాహ్న విరామ సమయంలో, పాఠశాల ముగిసిన తర్వాత విద్యార్థులు పెద్ద సంఖ్యలో వీటిని కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది చిన్నారులు ఇంటి నుంచి తీసుకువచ్చే ఆహారాన్ని కూడా పక్కనపెట్టి ప్యాకెట్ ఆహారాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో పిల్లల్లో పోషకాహార లోపం పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### ♦ నాణ్యతా ప్రమాణాలపై అనుమానాలు

కొన్ని ప్రాంతాల్లో గడువు ముగిసిన ఉత్పత్తులు లేదా నాణ్యతపై సందేహాలు ఉన్న ఆహార పదార్థాలు కూడా విక్రయమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్యాకెట్లపై తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యతా గుర్తులను పరిశీలించకుండా విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొన్ని ఉత్పత్తులపై తయారీ సంస్థ వివరాలు కూడా స్పష్టంగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

### ♦ ఎక్కడ ఆహార భద్రతా తనిఖీలు ?

ఆహార భద్రతా నిబంధనల ప్రకారం విక్రయించే ప్రతి ఉత్పత్తి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. అయితే క్షేత్రస్థాయిలో తనిఖీలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పాఠశాలల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నాణ్యతలేని ఆహార పదార్థాల విక్రయాలను అరికట్టాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

### ♦ చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నం

పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన ఈ అంశాన్ని అధికారులు అత్యంత ప్రాధాన్యంతో పరిగణించాలని ప్రజలు కోరుతున్నారు. ఆహార భద్రతా శాఖ తరచూ తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాలల సమీప ప్రాంతాల్లో విక్రయించే ఆహార పదార్థాల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. పిల్లల చేతిలో కనిపించే చిన్న ప్యాకెట్ కేవలం చిరుతిండి మాత్రమే కాదు... అది వారి ఆరోగ్య భవిష్యత్తును ప్రభావితం చేసే అంశం. రుచికి బానిసలవుతున్న బాల్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కుటుంబానిదే కాదు... సమాజం, ప్రభుత్వం, సంబంధిత శాఖలదీ. పిల్లల నవ్వుల్లో ఆరోగ్యం దాగి ఉంటుంది... ఆ ఆరోగ్యాన్ని కాపాడటమే ఆరోగ్యవంతమైన భావితరాల నిర్మాణానికి పునాది.



## సమస్యలు తప్పవు

**డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ,సూపరింటెండెంట్, భద్రాచలం ఏరియా ఆసుపత్రి**



చిన్నారులు తరచుగా అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలు కలిగిన ప్యాకెట్ ఆహారాలను తీసుకోవడం వల్ల ఊబకాయం, జీర్ణకోశ సమస్యలు, దంత సమస్యలు, భవిష్యత్తులో జీవనశైలి సంబంధిత వ్యాధులకు గురయ్యే ప్రమాదం పెరుగుతుంది . గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలు తీసుకుంటే ఆహార విషబాధ, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తవచ్చని అన్నారు. పిల్లలకు పండ్లు, పాలు, వేరుశెనగలు, శనగలు, ఇంట్లో తయారుచేసిన ఆరోగ్యకరమైన చిరుతిండ్లను అలవాటు చేయాలి .

# భక్తిశ్రద్ధల మధ్య కాటమయ్య లింగాల ప్రతిష్ట

- రాజపురంలో మేళతాళాల నడుమ సాగిన ఊరేగింపు
- నేడు మహా అన్నదాన కార్యక్రమం



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 17 (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని రాజపురం గ్రామంలో గౌడ్ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య లింగాల ప్రతిష్ట కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమైంది. ఉదయం తిరణపాకు కట్టి అర్చకులతో కలిసి రాముడు చెరువు సమీపంలోని తాళ్లవనం నుంచి కాటమయ్య, పోతురాజు, దైత, ముత్యాలమ్మ తల్లి లింగాలను గ్రామానికి తీసుకువచ్చారు. అనంతరం జలబిందెలతో ఆడబిడ్డలు మేళతాళాల నడుమ ఊరేగింపుగా బయలుదేరి కులదైవం కాటమయ్యను అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రామంలో ప్రదర్శించారు. గ్రామానికి చెందిన కందుమళ్ల నాగేశ్వరావు, సింహాచలం (స్వాతి) ఆలయ నిర్మాణం కోసం సుమారు రెండు కుంటల భూమిని దానం చేశారు. ఆ స్థలంలో నూతన లింగాలను అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య హోమగుండాల నడుమ ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గౌడ్ సంఘం అధ్యక్షుడు కంటే కృష్ణార్జున రావు, ఉపాధ్యక్షుడు మల్లెల వెంకటేశ్వరావు తెలిపారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రజలందరూ పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కంటే రాఘవులు, కేశవరావు, పుల్లూరు వెంకటేశ్వరావు, పులిచర్ల రవి, చీపు పెద్దలు, రామారావు, రాజేష్, బుడుపుల వెంకటేశ్వరావు, చెన్నారావు, సత్యం, వినోద్, సీతయ్య, రమాదేవి, అమరావతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలల్లో సమగ్ర సౌకర్యాలు – విద్యార్థులకు నాణ్యమైన విద్య: డిప్యూటీ డైరెక్టర్ చందన



**ములకలపల్లి, జూన్ 17(ప్రజాజ్యోతి):** ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందని భద్రాచలం ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చందన తెలిపారు. మండలంలోని కమలాపురంలో బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఐటిడిఎ పిఓ చంద్రమోహన్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ములకలపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కమలాపురం ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. విశాలమైన వసతి గృహాలు, పౌష్టికాహారం, క్రీడల్లో ప్రత్యేక శిక్షణతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఐటిడిఎ పిఓ ఎస్. చంద్రమోహన్ మాట్లాడుతూ, ఆశ్రమ వసతి గృహాల్లో విద్యార్థులకు అల్పాహారం, నాణ్యమైన భోజనం, నాలుగు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు ఉచితంగా ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో విద్యతో పాటు క్రీడా నైపుణ్యాలను కూడా పెంపొందిస్తున్నామని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతా బుచ్చిరాములు మాట్లాడుతూ, నాణ్యమైన విద్యాబోధన, క్రీడా శిక్షణ ఫలితంగా విద్యార్థులు పలు అవార్డులు సాధిస్తూ ఉత్తమ ఫలితాలు నమోదు చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గోవిందు, రాంకిషన్, సత్యనారాయణ, లక్ష్మణ్, రాములు, లక్ష్మీ బాయమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

- 21వ డివిజన్‌లో కార్పొరేటర్ శ్రావణి సాయికుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**సుజాతనగర్ , జూన్ 17 (ప్రజాజ్యోతి )** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ పరిధిలోని దేగలమడుగు, నాయకులగూడెం, గొల్లగూడెం మండల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు బుధవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ శ్రీమతి చింతలపూడి శ్రావణి సాయికుమార్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ, ఆసక్తి పెంపొందించుకుని విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులు, పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ప్రముఖ వ్యాపారవేత్త చింతలపూడి సాయికుమార్ విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# చేతిపంపులు, భగీరథ పైపులైన్ సమస్యలపై సర్పంచ్ స్పందన




**లక్ష్మీదేవిపల్లి, జూన్ 17 (ప్రజాజ్యోతి)** పెద్దతండా గ్రామంలోని పాఠశాల ప్రాంగణం, నూనావత్ టిక్యా ఇంటి సమీపంలోని చేతిపంపుల నీటిలో వాసన రావడంతో పాటు నలకలు కలిసివస్తున్నాయని సమాచారం అందడంతో సర్పంచ్ లావుడ్య పూర్ణ వెంటనే స్పందించారు. మండల చేతిపంపుల మరమ్మతుల బాధ్యులు వేణును పిలిపించి సమస్యను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే మెయిన్ రోడ్ పక్కన డ్రైనేజీ పనుల కారణంగా దెబ్బతిన్న మిషన్ భగీరథ పైపులైన్ సమస్యను గుర్తించి మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. పంచాయతీ సిబ్బందితో కలిసి పనులను పర్యవేక్షిస్తూ గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

# గిరిజన మహిళల కళ్లల్లో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యం

- పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి, జూన్ 17,ప్రజాజ్యోతి:** గిరిజన మహిళల కళ్లల్లో ఆనందం, ఆత్మవిశ్వాసం చూడడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు.బుధవారం టేకులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను వారు పరిశీలించారు. ఇళ్లలో నివసిస్తున్న లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంత ఇంటి కల సాకారమవుతోందని తెలిపారు. ముఖ్యంగా గిరిజన మహిళలు గౌరవప్రదమైన జీవనం గడపడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలితాలు గ్రామీణ ప్రాంతాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. లబ్ధిదారులు ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక దృష్టి

- 53 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు : ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్





**కొత్తగూడెం క్రైమ్, జూన్ 17 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు శాఖ ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ సూచనలతో ట్రాఫిక్ పోలీసులు బుధవారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, ప్రధాన రహదారులపై చేపట్టిన ఈ తనిఖీల్లో నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీల సందర్భంగా నెంబర్ ప్లేట్లు లేని 53 ద్విచక్ర వాహనాలను ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, బీమా పత్రాలు, ఇతర సంబంధిత డాక్యుమెంట్లను కూడా పరిశీలించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనానికి చట్టబద్ధమైన నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. వాహనదారులు తమ వాహనాలకు సరైన నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవడంతో పాటు రిజిస్ట్రేషన్, బీమా తదితర పత్రాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం మోటారు వాహనాల చట్టానికి విరుద్ధమని, అలాంటి వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెంబర్ ప్లేట్లు సక్రమంగా ఉండడం వల్ల వాహనాలు చోరీకి గురైన సందర్భాల్లో వాటిని గుర్తించడం స్వాధీనం చేసుకోవడం సులభమవుతుందని చెప్పారు. నేరాలకు పాల్పడే వ్యక్తులు కూడా ఎక్కువగా నెంబర్ ప్లేట్లు లేకుండా లేదా నకిలీ నెంబర్ ప్లేట్లతో వాహనాలను వినియోగించే అవకాశాలు ఉంటాయని అందువల్ల వాహనాల గుర్తింపు వ్యవస్థ పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల భద్రత, రోడ్డు రవాణా నియంత్రణ, నేరాల నివారణ లక్ష్యంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన రెండవ రోజు టీజీ టెట్ పరీక్షలు

- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 17,(ప్రజా జ్యోతి)** జిల్లాలో టీజీ టెట్ పరీక్షల రెండవ రోజు పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల్వంచలోని అనూ బోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఉదయం సెషన్‌లో 67 మందికి గాను 45 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 145 మందికి గాను 134 మంది అభ్యర్థులు హాజరయ్యారనీ తెలిపారు, పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ పరీక్షల ప్రశాంత నిర్వహణకు చర్యలు చేపట్టారని తెలిపారు

## ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన



చర్ల, జూన్ 17(ప్రజా జ్యోతి ):చర్ల మండలం ఆర్.కొత్తగూడెం పంచాయతీలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీడీ వో ఈదయ్య ముఖ్య అతిథిగా హాజరై, సర్పంచ్ తుర్రం రవి ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఏజెన్సీ ప్రాంత ప్రజలు దంత సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ఆత్మ కమిటీ చైర్మన్ ఇం దుల బుచ్చిబాబు ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ పెద్దాడ గీతానంద్ రోగులను పరీక్షించి, సుమారు 80 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ గీతానం ద్ మాట్లాడుతూ తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండటం వల్ల దంత సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించిన ఆత్మ కమిటీ చైర్మన్ ఇందుల బుచ్చిబాబును గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కా పుల కృష్ణార్జున రావు, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, ఏఈఓ రామకృష్ణ, గొర్ల రాజబాబు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు వెంటనే చెల్లించాలి



కొత్తగూడెం, జూన్ 17 (ప్రజాజ్యోతి)ఉమ్మడి కుటుంబాల పెండింగ్ ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు, నిర్మాణం పూర్తిచేసుకున్న లబ్ధిదారుల బిల్లులను వెంటనే విడుదల చేసి పేదలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కుటుంబాల్లో నివసిస్తూ సొంత ఇల్లు లేని లబ్ధిదారుల బిల్లులను సాంకేతిక కారణాలతో నిలిపివేయడం సరికాదన్నారు. గతంలో ఇల్లు ఉండి ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన కుటుంబాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. 600 చదరపు అడుగుల నిబంధన పేరుతో బిల్లులు నిలిపివేయొద్దని, జీవనోపాధి కోసం నాలుగు చక్రాల వాహనం ఉందనే కారణంతో దరఖాస్తులను తిరస్కరించవద్దని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో బేస్, రూఫ్, స్లాబ్ స్థాయికి ఇళ్లు నిర్మించుకుని బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్న వారికి వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. ఇల్లు మంజూరై పనులు ప్రారంభించని వారి నుంచి నాట్ విల్లింగ్ లేఖలు తీసుకోవాలని మొదటి విడతలో మిగిలిపోయిన 199 మందికి ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల వివరాల సేకరణ, మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, మేయర్ మూడ్ గణేష్, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ నవే రామ్, డీఈ ఖలీల్, తహసీల్దార్ పుల్లయ్య, ఎంపీడీవోలు సుభాషిణి, సుస్మిత, భారతి, ఏఈలు రమేష్‌బాబు, డేవిడ్, నసీరుద్దీన్, పుష్ప, లాల్ సాహెబ్, హసిత, బాధిత లబ్ధిదారులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



కొత్తగూడెం, జూన్ 17 (ప్రజా జ్యోతి)కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్‌కే సాబీర్ పాషా, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సింగు నర్సింహారావు డిమాండ్ చేశారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్మిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వరంగ సంస్థల రక్షణ కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, గౌనె మని, విజయలక్ష్మి, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, జక్కుల రాములు, మల్లికార్జున్ రావు, నజీర్ అహ్మద్, నిర్మల, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య రక్షణకు పరిశుభ్రతే మార్గం

- వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
డా. హారిక



**చర్ల, జూన్ 17 (ప్రజాజ్యోతి):** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య పరిరక్షణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. హారిక సూచించారు. వర్షాకాలంలో దోమలు, ఈగలు, బ్యాక్టీరియా, వైరస్‌ల ద్వారా వ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా "ఫ్రైడే–డ్రైడే" కార్యక్రమాన్ని పాటించాలని సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఇంటి పరిసరాలను పరిశీలించి దోమల పెరుగుదలకు అనుకూలంగా ఉండే నీటి నిల్వలను తొలగించాలని కోరారు. కూలర్లు, ఫ్రిజ్ వెనుక భాగాలు, పశువులు, కోళ్లకు నీరు పెట్టే తొట్టెలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ గ్లాసులు, మూతలు, పగిలిన కుండ పెంకులు, ఖాళీ సీసాలు తదితర వస్తువులలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాత టైర్లను ఇంటి పరిసరాల నుంచి తొలగించడం లేదా వాటికి రంధ్రాలు చేయడం ద్వారా నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంట్లో వాడే నీటిని ప్రతి మంగళవారం, శుక్రవారం పూర్తిగా ఖాళీ చేసి తాజా నీటితో నింపుకోవాలని చెప్పారు. ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా కాలువలు ఏర్పాటు చేయాలని, పెద్ద నీటి మడుగుల్లో వేస్ట్ ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. సెప్టిక్ ట్యాంకుల వెంటిలేషన్ పైపులకు జాలి అమర్చడంతో పాటు కిటికీలు, తలుపులకు మెష్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా దోమల ప్రవేశాన్ని అరికట్టవచ్చని వివరించారు. ఈ చర్యల ద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చని డా. హారిక తెలిపారు. అలాగే ఆహార పరిశుభ్రత విషయంలోనూ ప్రజలు జాగ్రత్త లు పాటించాలని సూచించారు. ఆహారాన్ని తాజాగా, వేడిగా ఉన్నప్పుడే తీసుకోవాలని, ఈగలు వాలకుండా వంట పాత్రలకు మూతలు ఉంచాలని చెప్పారు. ముఖ్యంగా చిన్నారులు బయట విక్రయించే పరిశుభ్రత లేని చిరుతిండ్లు, పానీపూరీ, కట్ ఫ్రూట్స్, తెరిచి ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కోరారు. ఇటువంటి ఆహార పదార్థాల ద్వారా టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలు మరిగించి చల్లార్చిన లేదా శుద్ధి చేసిన నీటినే తాగాలని, నదులు, చెరువులు లేదా ఇతర అసురక్షిత నీటి వనరుల నుంచి నేరుగా నీరు తాగకూడదని సూచించారు. జ్వరం, విరేచనాలు, వాంతులు, శరీర నొప్పులు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) లేదా సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ను సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నందున ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక ఖర్చులు చేసి ఆర్థికంగా నష్టపోవద్దని డా. హారిక విజ్ఞప్తి చేశారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు సబ్సిడీలో అందించాలి

- అఖిల భారత రైతు కూలి సంఘం




అశ్వాపల్లి. జూన్17(ప్రజాజ్యోతి)అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకెఎమ్ఎస్) ఆధ్వర్యంలో. స్థానిక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం వ్యవసాయ శాఖ అధికారికి. రైతులు వ్యవసాయ పనుల్లో ఎదుర్కొంటున్న నకిలీ విత్తనాలు అరికట్టే విధంగా రైతుకు నాణ్యమైన విత్తనాలు. ఎరువులు సబ్సిడీలో సకాలంలో ఇవ్వాలని. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు సమస్యలు ప్రభుత్వ పథకాల అమలులో ఉన్న లోపాల పైన అవగాహనా చెయ్యాలి. రైతుల హక్కులను పరిరక్షించడంతో పాటు పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, సంబంధిత శాఖలు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని (ఏఐకెఎమ్ఎస్) నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో (ఏఐకెఎమ్ఎస్) మండల అధ్యక్షులు కార్యదర్శి పూనెం రంగయ్య. కొమరం సత్యనారాయణ..పార్టీ అశ్వాపల్లి మండల కార్యదర్శి బట్టు సురేష్.మండల నాయకులు తోట వీరభద్రం. గాదెరాజు. ఐతకయ్య.పూసం రాంబాబు. రాందాస్. మెస్సు గోపాల్. భూచిరాజాం తదితరులు పాల్గొన్నారు

## ఫెర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా బుకింగ్‌కు అవకాశం

- : ఎంఏఓ బి. అరుణ్ బాబు



**ములకలపల్లి, జూన్ 17 (ప్రజాజ్యోతి):** రైతులు యూరియా కోసం క్యూలైన్లలో నిలబడాల్సిన అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం 'ఫెర్టిలైజర్ యాప్'ను అందుబాటులోకి తీసుకొచ్చిందని మండల వ్యవసాయ అధికారి బి. అరుణ్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఫెర్టిలైజర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, పట్టాదార్ పాస్‌బుక్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకుని, తమ సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియాను బుక్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. మొబైల్ నంబర్ నమోదు కాకపోతే సంబంధిత ఏఈఓను సంప్రదించాలని సూచించారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పత్తిలో అంతర పంటగా కంది సాగు చేయాలి

- జిల్లా వ్యవసాయ అధికారి వేల్పుల బాబురావు





అశ్వాపల్లి. జూన్17(ప్రజా జ్యోతి)జిల్లా వ్యవసాయ అధికారి వేల్పుల బాబు రావు బుధవారం అశ్వాపల్లి మండలంలో పలు ఎరువుల దుకాణాన్ని సందర్శించి యూరియా నిల్వలు, విత్తనాల నాణ్యత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పత్తి పంటలో అంతర పంటగా కందిని సాగు చేయాలని ఆయన సూచించారు. ఇలా చేయడం ద్వారా తక్కువ వర్షపాతం పరిస్థితుల్లోనూ రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు పంట నష్టాలను కొంత మేర తగ్గించుకోవచ్చని వివరించారు. అలాగే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయని, రైతులకు ఈ సందర్భంగా ఈరోజు నుంచే యూరియా అమ్మకాలను ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. యాప్ ఆధారిత విక్రయ విధానం ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు అర్హులైన రైతులకు సకాలంలో యూరియా అందే అవకాశం ఉంటుందని చెప్పారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి తెలియజేశారు.

● తీర్పుల్లో నిష్పాక్షికత ● తీరులో మానవీయత ● సత్వర న్యాయంతో బాధితులకు భరోసా ● సేవా భావంతో సమాజానికి దిక్సూచి ● కోర్టు గడప దాటి ప్రజల జీవితాల్లో విశ్వాసాన్ని నింపుతున్న మెజిస్ట్రేట్ శివ నాయక్






న్యాయ స్థానం గడప దాటే ప్రతి వ్యక్తి చేతిలో ఒక ఫైలు ఉంటుంది... కానీ గుండెల్లో మాత్రం ఒక ప్రశ్న ఉంటుంది "నాకు న్యాయం జరుగుతుందా?" ఆ ప్రశ్నకు చట్టంలోని నిబంధనలతో పాటు మానవత్వంతో కూడిన సమాధానం లభించినప్పుడే న్యాయవ్యవస్థపై విశ్వాసం బలపడుతుంది. సత్వర న్యాయాన్ని తన కర్తవ్యంగా, సేవాభావాన్ని తన ధర్మంగా, ప్రజల నమ్మకాన్ని తన బాధ్యతగా భావిస్తూ భద్రాచలంలో ప్రత్యేక ముద్ర వేస్తున్నారు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. శివ నాయక్. కోర్టు హాలులో తీర్పు వెలువడిన తర్వాత చప్పట్లు వినిపించకపోవచ్చు... కానీ బాధితుడి కళ్లలో కనిపించే తృప్తి, న్యాయం గెలిచిందనే నిశ్శబ్ద సంతృప్తి ఎంతో గొప్పది. అలాంటి ఎన్నో జీవితాల్లో ఆశను నింపుతూ, కోర్టు గదిలో చట్టాన్ని అమలు చేస్తూనే కోర్టు వెలుపల మానవీయ విలువలకు అండగా నిలుస్తున్న మెజిస్ట్రేట్ వి. శివ నాయక్ సేవలు నేడు భద్రాచలంలో ప్రత్యేక చర్చకు కారణమవుతున్నాయి. న్యాయాన్ని తీర్పుల్లోనే కాదు, ప్రజల జీవితాల్లోనూ నిలబెట్టేందుకు కృషి చేస్తున్న ఆయన సేవలపై... ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి
(భూక్యా రంజిత్ నాయక్ )

# న్యాయం పలికే స్వరం...

చట్టం అందరికీ సమానమని రాజ్యాంగం చెబుతుంది. అయితే ఆ చట్టం వెనుక మానవత్వం కూడా ఉండాలని సమాజం కోరుకుంటుంది. నేటి వేగవంతమైన ప్రపంచంలో ప్రజలు న్యాయస్థానాలను ఆశ్రయించేది కేవలం తీర్పు కోసం కాదు; తమకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం కోసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టడంలో భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివ నాయక్ తనదైన ముద్ర వేస్తున్నారు. కోర్టు హాలులో కఠినమైన న్యాయ సూత్రాలను అమలు చేస్తూనే, కోర్టు వెలుపల మానవీయ విలువలకు అండగా నిలుస్తున్న ఆయన పనితీరు అనేక వర్గాల ప్రశంసలు అందుకుంటోంది. న్యాయవ్యవస్థ ప్రజలకు ఎంత దగ్గరగా ఉంటే ప్రజాస్వామ్యం అంత బలపడుతుందనే నమ్మకంతో ఆయన ముందుకు సాగుతున్నారు.

### ♦ న్యాయం కోసం ఎదురుచూసే కళ్లలో ఆశను నింపుతూ...

కోర్టుల చుట్టూ తిరుగుతూ సంవత్సరాల తరబడి న్యాయం కోసం ఎదురుచూసే బాధితుల ఆవేదనను అర్థం చేసుకోవడం ప్రతి న్యాయాధికారికి సాధ్యం కాదు. కానీ కేసుల పరిష్కారంలో వేగం, విచారణల్లో క్రమబద్ధత, బాధితులకు అనవసర ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం ద్వారా శివ నాయక్ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు. "ఆలస్యమైన న్యాయం కూడా ఒక రకమైన అన్యాయమే" అనే భావనను తన విధి నిర్వహణలో ప్రతిబింబింపజేస్తూ, సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నారని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### ♦ బలహీనులకు అండగా...

వృద్ధాప్యంతో, అనారోగ్యంతో, దివ్యాంగత్వంతో కోర్టు మెట్లు ఎక్కలేని వారి పరిస్థితులను అర్థం చేసుకొని వారికి అనుకూలంగా న్యాయ ప్రక్రియను కొనసాగించే విధానం ఆయనలోని మానవీయ కోణాన్ని ప్రతిబింబిస్తోంది. చట్టం ముందు అందరూ సమానమే అయినప్పటికీ, ప్రతి మనిషి పరిస్థితి ఒకేలా ఉండదనే విషయాన్ని గుర్తించి వ్యవహరించడం ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజల్లో మరింత గౌరవం పెరుగుతోంది.

## ప్రజల మనసులు గెలిచిన వ్యక్తిత్వం

### ♦ శిక్షలో సంస్కరణకు ప్రాధాన్యం

నేరాన్ని అరికట్టాలంటే శిక్ష ఒక్కటే మార్గం కాదనే ఆధునిక న్యాయ తత్వాన్ని శివ నాయక్ తన కార్యాచరణ ద్వారా చాటుతున్నారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి కేసుల్లో సామాజిక బాధ్యతను గుర్తు చేసే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ, వ్యక్తుల్లో మార్పు తీసుకురావాలనే దృక్పథంతో వ్యవహరిస్తున్నారు. ఇది కేవలం చట్ట అమలుకే పరిమితం కాకుండా సమాజ నిర్మాణంలోనూ న్యాయవ్యవస్థ పాత్ర ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది.

### ♦ విద్యార్థుల్లో రాజ్యాంగ చైతన్యం

నేటి యువతే రేపటి భారతదేశం. ఈ ఆలోచనతో పాఠశాలలు, కళాశాలల్లో భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, పౌర బాధ్యతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో చట్టాల పట్ల గౌరవం పెంపొందిస్తున్నారు. పుస్తకాల్లో మాత్రమే కాకుండా జీవితంలోనూ రాజ్యాంగ విలువలు ప్రతిబింబించాలనే సందేశాన్ని యువతకు అందిస్తున్నారు.

### ♦ కోర్టు గోడల్ని దాటి సమాజంలోకి...

అనాథాశ్రమాలు, బాలల సంరక్షణ కేంద్రాలు, సబ్ జైళ్లను సందర్శించడం, అక్కడి పరిస్థితులను తెలుసుకోవడం, అవసరమైన న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాల్లోనూ ఆయన చురుకుగా పాల్గొంటున్నారు. సమాజంలోని చివరి వ్యక్తికీ న్యాయం చేరాలనే సంకల్పం ఆయన సేవా కార్యక్రమాల్లో స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.



### ♦ విపత్తుల వేళ సేవా స్ఫూర్తి

వరదలు, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు అధికార వ్యవస్థతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొనడం ద్వారా శివ నాయక్ కేవలం న్యాయాధికారి మాత్రమే కాకుండా సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తిగా నిలిచారు. అవసర సమయంలో ప్రజల పక్కన నిలబడటం ద్వారా ఆయన మానవీయ విలువలను ఆచరణలో చూపిస్తున్నారు.


### ♦ పచ్చని భవిష్యత్తు కోసం...

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం, మొక్కలు నాటడం, యువతలో ప్రకృతి పట్ల బాధ్యత పెంపొందించడం వంటి కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజానికి మరో సందేశం ఇస్తున్నారు. న్యాయం మనుషుల మధ్య మాత్రమే కాదు, భవిష్యత్ తరాల పట్ల కూడా ఉండాలనే ఆలోచనను ఆయన ముందుకు తీసుకెళ్తున్నారు.





- అర్హత ఉన్న అభ్యర్థులకు మంగళం..!
- ఇష్టానుసారంగా నియామకాలు జరిగాయా..?
- డిగ్రీ అర్హత వారికే పెద్దపీట..?
- స్టేషన్ బస్తీ ప్రైమరీ స్కూల్ లో జరిగిన వ్యవహారం?
- ఒక్క పోస్టుకు 29 దరఖాస్తులు..!
- నాన్ లోకల్ పేరుతో అభ్యర్థుల తొలగింపు..?
- మెరిట్ తక్కువ ఉన్నవారికే పెద్ద పీట..?
- బీఈడీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం..!
- నియామకాలపై విమర్శల వెల్లువ
- అధికారుల తీరుపై ఆరోపణలు
- ఉన్నతాధికారులు జర స్పందించరూ!




# ఇన్ స్ట్రక్టర్ పోస్టుల్లో... గోల్‌మాల్..?

**ఇల్లందు, జూన్ 17 (ప్రజా జ్యోతి)**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఇన్స్ట్రక్చర్ పోస్టుల నియామక ప్రక్రియ తీవ్ర వివాదానికి దారి తీసింది.

అర్హతలు, మెరిట్, అనుభవం, స్థానికత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా కొందరికి అనుకూలంగా నియామకాలు చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, అర్హులైన అభ్యర్థులను పక్కన బెట్టి తక్కువ అర్హతలు కలిగిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం ఇల్లందులో చర్చనీయాంశంగా మారింది. ఒక్క పోస్టుకు దాదాపు 29 మంది వరకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎంపిక విధానం ఏమిటి... ఏ ప్రామాణికాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారనే వివరాలు బయటకు రాకపోవడం అనుమానాలకు తావిస్తుంది. ఎంపిక జాబితాను బహిరంగపరచకుండా నియామకాలు పూర్తి చేయడం వెనుక అసలు కారణం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా ఒక్క ఇన్స్ట్రక్చర్ పోస్టు కోసం 29 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. సంబంధిత శాఖ అధికారులు అభ్యర్థులను పరిశీలించి నాన్ లోకల్ వారిని తొలగించినప్పటికి బిఈడీ వారికి కాకుండా డిగ్రీ అర్హతలో మెరిట్ తక్కువగా ఉన్న వారికే ప్రాధాన్యత ఇచ్చినట్లు పట్టణంలో తీవ్ర చర్చ జరుగుతుంది.

### అర్హత ఉన్నవారికి అన్యాయం..?

ఉన్నత విద్యార్హతలు, అనుభవం, శిక్షణ కలిగిన అభ్యర్థులు ఎంపిక కాకపోగా తక్కువ మెరిట్ కలిగిన వ్యక్తులకు అవకాశాలు దక్కాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనేక సంవత్సరాలుగా ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. నియామకాల్లో నిబంధనలను పాటించకపోతే అర్హులైన అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› డిగ్రీ అభ్యర్థులకే ప్రాధాన్యత..?

పట్టణంలోని స్టేషన్ బస్తిలో గల ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ పాఠశాలలో ఇన్స్ట్రక్టర్ పోస్టు నియామక ప్రక్రియలో డిగ్రీ అర్హత కలిగిన వారికే అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. బీఈడీ అర్హత ఉన్న అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోలేదని సమాచారం. విద్యా రంగానికి సంబంధించిన పోస్టుల భర్తీలో శిక్షణ పొందిన అభ్యర్థులను విస్మరించడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### నాన్ లోకల్ వివాదం

స్థానికతను ప్రధాన అర్హతగా చూపిస్తూ కొందరు నాన్ లోకల్ అభ్యర్థులను ఎంపిక ప్రక్రియ నుంచి తప్పించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అదే సమయంలో స్థానికత ప్రమాణాలు కొందరికి మాత్రమే వర్తింపజేసి, మరికొందరికి మినహాయింపులు ఇచ్చారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

### ››› మెరిట్ జాబితా ఎందుకు గోప్యం..?

స్టేషన్ బస్తీ ప్రీ ప్రైమరీ స్కూల్ లో ఇన్స్ట్రక్టర్ నియామకాల్లో అత్యంత కీలకమైన మెరిట్ జాబితా, మార్కుల వివరాలు, ఇంటర్వ్యూ స్కోర్లు, ఎంపిక ప్రమాణాలు బహిరంగపరచకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తుంది. నిజంగా మెరిట్ ఆధారంగానే ఎంపిక జరిగి ఉంటే వివరాలను ప్రకటించడంలో అభ్యంతరం ఎందుకని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

### బీఈడీ అభ్యర్థుల ఆందోళన

పట్టణంలోని స్టేషన్ బస్తి ప్రీ ప్రైమరీ స్కూల్ లో ఒక ఇన్స్ట్రక్టర్ పోస్టు కోసం బీఈడీ పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యా బోధనలో ప్రత్యేక శిక్షణ పొందిన తమలాంటి వారిని విస్మరించడం సరైన పద్ధతి కాదని అంటున్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు అవకాశాలు కల్పించకుండా ఇతరులను ఎంపిక చేయడం వల్ల విద్యా నాణ్యత కూడా దెబ్బతింటుందని వారు పేర్కొంటున్నారు.

### ››› అధికారులపై ఆరోపణలు..?

స్టేషన్ బస్తి ప్రీ ప్రైమరీ స్కూల్ లో ఒక ఇన్స్ట్రక్టర్ పోస్టు నియామక ప్రక్రియలో కొందరు అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందుగానే కొందరిని ఎంపిక చేసుకోని అనంతరం ప్రక్రియను నిర్వహించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించకపోవడం మరిన్ని సందేహాలకు కారణమవుతుందని ఆరోపణలు వస్తున్నాయి.

### ››› విచారణ జరిపించాలని డిమాండ్..!

స్టేషన్ బస్తి ప్రీ ప్రైమరీ స్కూల్ లో ఒక ఇన్స్ట్రక్టర్ పోస్టు నియామకాలపై వస్తున్న ఆరోపణలను దృష్టిలో ఉంచుకోని స్వతంత్ర విచారణ కమిటీని నియమించాలని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఎంపిక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందుంచి పారదర్శకతను నిరూపించాలని డిమాండ్ చేస్తున్నారు. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ››› ఉన్నతాధికారులు స్పందించరూ

స్టేషన్ బస్తి ప్రీ ప్రైమరీ స్కూల్ లో ఒక ఇన్స్ట్రక్టర్ పోస్టు నియామక ప్రక్రియపై అభ్యర్థులు, ప్రజా సంఘాలు, నిరుద్యోగ యువత నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవుతున్నప్పటికీ ఇప్పటి వరకు ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన స్పందన రాలేదు. వివాదాలకు తెరదించాలంటే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఈ వ్యవహారం మరింత పెద్ద వివాదంగా మారే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## పారదర్శకంగానే ఎంపిక

**ఉమాశంకర్, మండల విద్యాశాఖ అధికారి, ఇల్లందు**

స్టేషన్ బస్తి ప్రీ ప్రైమరీ స్కూల్ లో ఒక ఇన్స్ట్రక్టర్ పోస్టు మర్తిని పూర్తి పారదర్శకంగా నిర్వహించాం. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా ప్రక్రియ చేపడుతున్నాం. అర్హత ఉన్న వారినే ఎంపిక చేయడం జరుగుతుంది.